క్లుప్తంగా

ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం



ఈరలక్కప్పను ఆహ్వానిస్తున్న టీడీ పల్లి గ్రామస్తులు

గుడిబండ: రొళ్ల మండలం టీడీ పల్లిలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమం నవంబర్ 3న నిశ్చయించారు. దీంతో మంగళవారం టీడీ పల్లికి చెందిన ఆలయ కమిటీ సభ్యులు గుడిబండ మండలం ఫళారం గ్రామం చేరుకుని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పకు ఆలయ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు.

పంట కోత విధానాలపై శిక్షణ

గుడిబండ: మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఖరీఫ్ పంటల కోతకు సంబంధించిన ప్రయోగాలపై మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంట కోత ప్రయోగాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. 2025 సంబంధించిన పంట ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పంట నమోదు కాని రైతులు అక్టోబర్ 20లోపు రైతు సేవా కేంద్రల్లో నమోదు చేయించుకోవాలన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఎంపిక



కమిటీ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

గోరంట్ల: పట్టణంలోని మేధావులు, ప్రముఖులు మంగళవారం గ్రంథాలయ అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయ అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఈతమాను ఆదినారాయణ, గౌరవాధ్యక్షులుగా పి.రామలింగారెడ్డి, జీఎం సురేష్, కె.శ్రీరాములును ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా శ్రీదేవి, కార్యదర్శులుగా శ్రీనివాస గుప్త, రమేష్‌బాబు, కోశాధికారిగా మురళికృష్ణారెడ్డి, గౌరవ సలహదారుడిగా రిటైర్డు విద్యాశాఖ అధికారి జయచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా విశ్రాంత ఉద్యోగులు నరహరమూర్తి, బాషుసాహెబ్‌ను ఎన్నుకున్నారు. గ్రంథాలయ అభివృద్ధికి కృషిచేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

మద్యం కేసు సీబీఐకి అప్పగించాలి

మడకశిర: రాష్ట్రంలో సంచలనం రేపిన నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పగించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎస్ రవి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సిట్ విచారణతో నిజనిజాలు బయటికి రావని తెలిపారు. సిట్ కూటమి ప్రభుత్వ ఆధీనంలో పని చేస్తుందని.. దీంతో నిజాలు ఎలా బయటికి వస్తాయని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం హయాంలో నకిలీ మద్యం ఏరులై పారుతోందని ఆరోపించారు. అమాయకుల ప్రాణాలు నకిలీ మద్యంతో గాలిలో కలిసి పోతున్నాయని విమర్శించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

పరిగి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఆటల పోటీలకు మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీ విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఇటీవల అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అండర్ –19 విభాగంలో ఏపీఆర్‌జేసీ విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారు. జిల్లా స్థాయి అథ్లెటిక్స్, రగ్బీ, హ్యాండ్‌బాల్ పోటీల్లో కళాశాలకు చెందిన 11 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రమీళమ్మ ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనిల్ కుమార్, పురుషోత్తం, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గోవిందాపురంలో పశు వైద్యశిబిరం

మడకశిరరూరల్: మండలంలోని గోవిందాపురంలో మంగళవారం మడకశిర ప్రభుత్వ కావేరప్ప వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల శివ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పశువులకు చికిత్సలు నిర్వహించి గోమార్లు, పిడదల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి శిబిరాలను ప్రతిగ్రామంలో కూడా ఏర్పాటు చేస్తామన్నారు. డాక్టర్ పురుషోత్తమరెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

టమాట.. నష్టాల బాట

- అప్పులపాలవుతున్న రైతులు
- పెట్టుబడి కూడా దక్కని వైనం
- గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం
- ఆదుకోవాలని కోరుతున్న రైతులు



అమరాపురం మండలంలో సాగు చేసిన టమాట పంట



తమ్మడేపల్లిలో టమాటను మార్కెట్‌కు సిద్ధం చేస్తున్న కూలీలు

అమరాపురం: టమాట రైతులకు కాలం కలసి రావడం లేదు. ఆరుగాలం పంట సాగు చేసిన రైతులు నష్టాల బాట పడుతున్నారు. ఈ ఏడాది బోరు బావుల కింద రైతులు అప్పులు చేసి టమాట పంటను సాగు చేశారు. అయితే దిగుబడి బాగున్నా ధరలు లేక నష్ట పోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం మార్కెట్‌లో టమాట ధరలు భారీగా పడిపోయాయి. 12 కేజీల నాణ్యమైన టమాట కాయల బుట్ట రూ.80 నుంచి 120 వరకూ ధరలు పలుకుతున్నాయి. పండించిన పంట చేతికందే సమయంలో ధరలు తగ్గడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. రెండు నెలల క్రితం ఉన్న ధరలు ప్రస్తుతం లేవని చెబుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

800 ఎకరాల్లో సాగు

మడకశిర నియోజకవర్గంలోని అమరాపురం, రొళ్ల, అగళి, గుడిబండ, మడకశిర మండలాల్లో రైతులు 800 ఎకరాల్లో బోరు బావుల కింద టమాట సాగు చేశారు. ఈ పంట సాగు చేయడానికి ఎకరాకు రూ.60 వేల దాకా ఖర్చు పెట్టుకున్నారు. ఎరువులు, మందుల పిచికారీ, కూలీల ఖర్చు అదనంగా భరించారు. తీరా పంట చేతికందే సమయంలో మార్కెట్లో ధరలు పడిపోవడంతో తాము పెట్టిన పెట్టుబడి కూడా రాదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంటను అమ్ముకోవాలంటే తమ ప్రాంతంలో మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో కర్ణాటక రాష్ట్రం చింతామణి, కోలార్, ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. దీంతో రవాణా ఖర్చులు అధికంగా పెట్టుకోవాల్సి వస్తోందన్నారు.

అదేవిధంగా ప్రస్తుతం ఆడ, మగ కూలీల ఖర్చులు ఎక్కువగా వస్తున్నాయి. పెట్టుబడి ఖర్చులు, కూలీల ఖర్చులన్నీ పోతే తమకు మిగిలేది ఏమి లేదని రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏ పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదు. పంట నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గిట్టుబాటు ధర లేదు



బోరు బావి కింద రెండు ఎకరాల్లో టమాట సాగు చేశాను. పంట సాగు కోసం రూ.1.5 లక్షలు ఖర్చు చేశాను. పంట దిగుబడి బాగా వచ్చింది. అయితే ప్రస్తుతం మార్కెట్లో ధరలు లేవు. మా ప్రాంతంలో మార్కెట్ సౌకర్యం లేక పోవడంతో ప్రైవేట్ వాహనంలో కోలార్‌కు తరలిస్తున్నాం. ఖర్చులన్నీ తీసివేస్తే చివరికి నష్టం మిగిలింది. ప్రభుత్వం రైతులకు పథకాలు అమలు చేయాలి.

– అనిల్ కుమార్, రైతు, తమ్మదేపల్లి

ఆర్థికంగా చితికిపోయాం

బోరుబావి కింద ఒకటిన్నర ఎకరాలో టమాట పంట సాగు చేశాను. దిగుబడి బాగానే ఉంది. అయితే మార్కెట్‌లో ఆశించిన ధరలు లేవు. పంటల సాగుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు రావడం లేదు. టమాట సాగు చేసిన రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. నష్టాల బాట పడుతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. లేకుంటే ప్రభుత్వమే రైతుల నంచి టమాటను కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– రుద్రప్ప, రైతు, చిట్నడకు

సీపీఆర్ టెక్నిక్‌పై అవగాహన

అమరాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం సీపీఆర్ టెక్నిక్‌పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయుర్వేద వైద్యురాలు అనురాధ అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినపుడు మనం వ్యక్తిని ఏవిధంగా రక్షించుకోవచ్చు, ఎంత వ్యవధిలో డాక్టర్ వద్దకు తీసుకెళ్లాలి తదితర వాటిపై వివరించారు. కార్డియో పుల్మోనరి రెస్యూటేషన్ టెక్నిక్‌పై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణా నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు తప్పనిసరి

సోమందేపల్లి: పట్టు రైతులు మల్బరీ సాగు చేసే క్రమంలో మొదటగా మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయాలని శాస్త్రవేత్త డాక్టర్ రమ్య సూచించారు. మంగళవారం మండలంలోని జూలకుంట గ్రామంలో 'నా పట్టు –నా అభిమానం' కార్యక్రమంలో భాగంగా పట్టు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకం వల్ల పంట దిగుబడి బాగుంటుందన్నారు. కార్యక్రమంలో సిరికల్చర్ ఏడీ రత్నం, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఫొటో ఏర్పాటుపై గొడవ



పాల డెయిరీ వద్ద కాంగ్రెస్ నాయకులు

పావగడ: స్థానిక టోల్ గేట్ వద్ద ఉన్న నందిని పాల డెయిరీలో స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, అతని తండ్రి మాజీ మంత్రి వెంకటరమణప్ప ఉన్న ఫొటో నిర్వాహకుడు ఏర్పాటు చేసుకున్నాడు. అయితే ప్రభుత్వ పరిధిలో ఉన్న నందిని పాల డెయిరీలో ప్రైవేట్ వ్యక్తుల ఫొటో ఉండకూడదని స్థానిక జేడీఎస్ నాయకులు గంగాధర నాయుడు, కావలగేరి రామాంజినప్ప ఆక్షేపించారు. అంతేకాకుండా మంగళవారం వారు పాల డెయిరీ వద్దకు వచ్చి ఫొటో తొలగించాలని గొడవ చేశారు. అలాగే ఈ విషయంపై కేఎంఎఫ్ ఎండీతో కూడా చర్చించారు. మాజీ మంత్రి ఉన్న ఫొటో తొలగిస్తామని ఎండీ చెప్పినట్లు వారు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు పాల డెయిరీ వద్దకు చేరుకుని ఫొటో తొలగించ కూడదని డెయిరీ యజమానికి సూచించారు. అలాగే జేడీఎస్ నాయకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పంచాయతీ కార్యాలయానికి తాళం



సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు

పావగడ: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తాలూకాలోని కోటగుడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయానికి గ్రామస్తులు తాళం వేసి ఆందోళన చేపట్టారు. గ్రామ పంచాయతీ సభ్యుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ.. దోమల బెడదతో కడపలకెరె గ్రామంలో ముగ్గురు డెంగ్యూ, 10 మంది వైరల్ జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దోమల బెడదను నివారించేందుకు గ్రామంలో ఫాగింగ్ చేయాలని పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని పేర్కొన్నారు. 15వ ఫైనాన్స్ యోజన కింద గ్రామ పంచాయతీ అధికారులు ఎలాంటి పరికరాలు తీసుకోకుండానే బిల్లులు డ్రా చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఏజెన్సీలకు కమీషన్ అందించి సుమారు రూ.30 లక్షల వరకు డ్రా చేసుకున్నారని ఆరోపించారు. అవినీతిపై విచారణ జరిపించాలని ఈఓ ఉత్తమ్ కుమార్‌ను డిమాండ్ చేశారు.

అందరికీ కృతజ్ఞతలు

మడకశిర: మడకశిరలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నకిలీ మద్యంపై చేసిన నిరసన కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని నిరసన కార్యక్రమానికి మద్దతు పలికారన్నారు. మహిళలు తరలివచ్చి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా దిగి వచ్చి నకిలీ మద్యాన్ని అరికట్టాలని కోరారు. లేకుంటే ప్రజాగ్రహానికి గురవతారని ఆయన హెచ్చరించారు.

డిజిటల్ బుక్ పోస్టర్ల ఆవిష్కరణ



హిందూపురంలో డిజిటల్ బుక్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కన్వీనర్ రాము, నాయకులు

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రూరల్ మండల కన్వీనర్ రాము ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ పోస్టర్లు ఆవిష్కరించారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆయన క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని టీడీపీ నేతలు ఎన్నో అరాచకాలు చేశారన్నారు. ఇబ్బందులకు గురవుతున్న వారు ఆధారాలు సహా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూర్యమోహన్, నాయకులు కొల్లప్ప, నాగరాజు, నంజిరెడ్డి, లోకేష్, బాలాజీ, రామాంజి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌తో పార్టీ శ్రేణులకు రక్ష



రొళ్లలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ నాయకులు



అగళిలో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, నేతలు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

రొళ్ల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ వారిపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలకు చెక్ పెట్టేందుకు డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ కమిటీ సభ్యులతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అరాచక పాలన కొనసాగుతోందని ఆరోపించారు. కూటమి నాయకుల ద్వారా దాడులు, దౌర్జన్యాలకు గురైన వారు ఆ వివరాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవాలని తెలియజేశారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో సూపర్ ఫ్లాప్ చేశారని విమర్శించారు. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాక ముందు ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకోవడం అధికారంలోకి వచ్చిన తర్వాత దారుణంగా మోసగించడం పారిపాటిగా మారిందని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు నాగేష్ గౌడ, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు రంగారెడ్డి, జగదీష్ బాబు, యర్రగుంటప్ప, ముద్దారెడ్డి, రవిచంద్ర, శ్రీనివాస్, గోవిందప్ప, మూడ్లప్ప, రంగనాథ్, సీఎం ఘట్ట రవి, హనుమంత రాయప్ప, సురేష్, సుబ్బన్న, దేవరాజు, సంజీవప్ప, కార్యకర్తలు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

అగళి: సామాన్యులు, పేదలకు వైద్య అందకూడదనే దురుద్దేశంతో వైద్య కళాశాలలను సీఎం చంద్రబాబు ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమయ్యారని నియోజవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలతో కలసి వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణలో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ.. జగన్‌మోహన్ రెడ్డి 5 ఏళ్ల పాలనలో 17 వైద్య కళాశాలలను తీసుకొచ్చారన్నారు.

చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో ఒక్క కళాశాల కూడా కట్టలేదన్నారు. వైద్య కళాశాలలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచినప్పుడే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేస్తామంటే చూస్తు ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజల తరఫున పోరాటం చేయాడానికి వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. ఈ మేరకు కోటి సంతకాలు సేకరించి వారి ఆకాంక్షను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, సర్పంచులు ముద్దరాజు, రామకృష్ణప్ప, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు జయరామప్ప, నాయకులు, శివన్న, సదానంద ఆరాధ్య, తిమ్మరాయప్ప, సుర్యనారాయణరెడ్డి, కృష్ణ, గురులింగప్ప, లింగరాజు, సన్నప్ప, గంగాధర్, శంకరప్ప, ప్రకాష్, కాంతరాజు, హనుమంతరాయప్ప, ఈరన్న, గోవిందప్ప మంజునాథ్, నాగరాజు, మైలారప్ప, గంట నాగరాజు, సురేష్, కాంత, సన్నప్ప, సిద్ధలింగ, రమేష్, బాలకృష్ణ, హనుమంతరాయప్ప, లక్ష్మీకాంత, జగదీష్, రాజన్న, హనుమంత రాయప్ప, సుల్తాన్, అక్లిమ్, గోవిందప్ప, గిరిష్, మంజునాథ్, నాగేంద్ర, వినయ, హనుమంత రాజు, గంగాధర్, మలికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



రొళ్ల: గొట్టుగుర్కిలో జ్యోతులు మోసకెళ్తున్న మహిళలు



గుడిబండ: కొల్లాపురమ్మకు జ్యోతులు సమర్పిస్తున్న మహిళలు

రొళ్ల: మండలంలోని గొట్టుగుర్కి, క్యాతప్పపాళ్యం, గొట్టుగుర్కిగొల్లహట్టి తదితర గ్రామాల్లో మంగళవారం జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రమే గుడ్డగుర్కి గ్రామంలో వెలసిన కొల్లాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని గ్రామస్తులు ఊరేగింపుగా గ్రామానికి తీసుకువచ్చి పట్టం కూర్చోబెట్టారు. గ్రామానికి చెందిన మహిళల జ్యోతులను మోసుకుని మేళతాళాలతో ఉత్సవ విగ్రహం పట్టం కూర్చోబెట్టిన ప్రదేశానికి వచ్చి, అమ్మవారికి సమర్పించారు. విషేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు ఉత్సవానికి తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదానం కార్యక్రమం చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తదితరులు ఉత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కొల్లాపురమ్మ జాతర

గుడిబండ: మండల పరిధిలోని నాగేపల్లి గ్రామంలో కొల్లాపురమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి కుంకుమార్చన, గంగపూజ, తులసీ పూజ చేపట్టారు. వివిధ పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడువ వీధుల్లో ఊరేగించారు. అమ్మ వారి విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రత్యేక పూజలు చేసి జ్యోతులను సమర్పించారు. అలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మా బంగారం ఇవ్వాల్సిందే..

- బ్యాంకు ఎదుట ఎన్నారై ధర్నా

పెనుకొండ రూరల్: తనఖా పెట్టిన మా బంగారం ఇవ్వాల్సిందే అంటూ ఓ.. ఎన్నారై స్టేట్ బ్యాంక్‌లో భీష్మించి కూర్చొన్నాడు. పోలీసుల జోక్యం చేసుకోవడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమునిగింది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని శెట్టిపల్లి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో పుట్టపర్తి మండలం రాచవారిపల్లికి చెందిన వెంకప్పనాయుడు. 32 తులాల బంగారాన్ని తనఖా పెట్టి రుణం పొందాడు. ఏడాది క్రితం ఆయన మృతి చెందడంతో.. విదేశాల్లో స్థిరపడిన అతడి కుమారుడు మారినేని చంద్రానాయుడు నాలుగు నెలల నుంచి బ్యాంకులో రుణం చెల్లించి బంగారు విడిపించుకునే ప్రయత్నం సాగిస్తున్నాడు. అయితే బ్యాంక్ సిబ్బంది సరైన సమాధానం ఇవ్వకుండా దాట వేయడంతో, మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ బ్యాంక్‌లో భీష్మించి కూర్చొన్నాడు. బ్యాంకు మేనేజర్ హనుమంతరెడ్డి సమాచారం మేరకు ఎస్ఐ అక్కడకు వెళ్లి బ్యాంకు ఉన్నతాధికారులతో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని బ్యాంకు అధికారులు హామీ ఇవ్వడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమునిగినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రధాని మోదీ పర్యటనను అడ్డుకుంటాం



పెనుకొండలో విలేకరులతో మాట్లాడుతున్న బంజారా సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్/పెనుకొండ రూరల్: కర్నూలుకు చెందిన సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం చేస్తానని ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్రమోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చి న్యాయం చేయలేదని, అలాంటి వారి కర్నూలు పర్యటనను అడ్డుకుంటామని అఖిల భారత బంజారా సేవా సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పుట్టపర్తిలో ప్రకటన విడుదల చేయడంతో పాటు పెనుకొండలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గిరిజనుల దాడులు పెరిగిపోయాయన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 16న ప్రధాని పర్యటన అడ్డుకుంటామన్నారు. పెనుకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిల భారత బంజారా సేవా సంఘం ఉపాధ్యక్షుడు రాజేంద్ర నాయక్, జనరల్ సెక్రటరీ విశ్వనాథ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది మృతికి సంతాపం

హిందూపురం: పట్టణంలో సీనియర్ న్యాయవాది పి.నాగభూషణరావు (73) మృతి పట్ల మంగళవారం న్యాయమూర్తులు సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ నాగభూషణరావు బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని హిందూపురానికి తీసుకురాగా న్యాయమూర్తులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అదనపు జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వన్నేరువప్ప, కార్యదర్శులు రామచంద్రప్ప ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, జూనియర్ సివిల్ జడ్జిలు అశోక్ కుమార్, లలిత లక్ష్మి హారిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య తదితరులు నివాళులర్పించారు.

యువకుడి మృతి

హిందూపురం: పట్టణానికి చెందిన శ్రీన (22) మంగళవారం బెంగళూరులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. రెండురోజుల క్రితం హిందూపురం సమీపంలోని కర్ణాటక వంకాయల గేట్ వద్ద నందిని మద్యం షాపు వద్దకు స్నేహితుల కలసి మద్యం సేవించడానికి వచ్చి గొడవ పడినట్లు తెలియవచ్చింది. అక్కడ గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. అతడిని మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కర్ణాటక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.